# నాగరాజీయమ్

రాయసం వెంకట్రామయ్య

9

## ఈతగాడు

తాళ్లపాలెంలో మా పిన్ని కూతురి పెళ్లికి నాతోపాటు నాగరాజుక్కూడా శుభలేఖ వచ్చింది. మా బాబాయిగార్కి దూరపు బంధువు నాగరాజు. చిన్నతనం నుంచీ మా స్నేహితులందరూ మా పిన్నిక్కూడా తెలుసు. అందుకనే నాకు ఉత్తరంలో నాగరాజుని కూడా తీసుకురమ్మని రాసింది పిన్ని. వాడింట్లో మనిషిలా ఉంటాడు. శ్రీమతి, మా అమ్మాయి రాలేమన్నారు. నాకూ, నాగరాజుకి టికెట్లు కొన్నాను.

''శ్రావణమాసంలో పెట్టారేమిటో పెళ్లి? వర్షాల్లో ఇబ్బందే'' అంది శ్రీమతి.

''ఇబ్బందేమిటి! అక్కడ పెద్ద కాలువ పొంగకుండా వుంటే చాలు. నాకసలే నీరంటే భయం. అయినా వెళ్లక తప్పదు'' అన్నాను.

నేనూ నాగరాజు నిడదవోలులో రైలు దిగి రిక్షామీద తాళ్లపాలెం వెళ్లబోయాం. రోడ్డు గుంటలుపడి నానా బీభత్సంగా వుంది. వర్షాలకి మూడొంతులు రోడ్డు కొట్టుకుపోయింది. ప్రక్కనే పెద్ద మడుగు. అందుకని కొంత దూరం వెళ్లాక రిక్షావాడి డబ్బులు వాడికిచ్చేసి సంచీలు పుచ్చుకుని కాలినడక మీద ఇల్లు చేరాం.

తాటాకు పందిళ్లు వేశారు ఇంటిముందు, పెరట్లోను. అది పాతకాలపు ఇల్లు. ముందు పెద్ద పెద్ద గచ్చు అరుగులున్నాయి. లోపల మండువా. దానివెనక భోజనశాల, వంట గది. మండువాకి పక్కల్లో పడక గదులు. ఎదురింటి కరణంగారిల్లు విడిది. వాళ్లింట్లో ముందు భాగమంతా ఖాళీచేసిచ్చారు.

ఎక్కడ చూసినా జనమే. ఎక్కడెక్కడి బంధువులూ వచ్చారు. పిన్ని ఆఖరి కూతురి పెళ్లికి అందర్నీ రమ్మని రాసింది. మేమిద్దరం మండువాలో ఓ మూల సంచీలు పెట్టి బట్టలు మార్చుకుని కాలకృత్యాలు తీర్చుకున్నాము. నాగరాజు ఆరోజు కసరత్తులు మానేశాడు కానీ పూజ మాత్రం గంట చేశాడు.

నాగరాజునీ, నన్నూ చూడగానే పిన్ని చాలా ఆనందించింది.

''ఒరేయ్ నువ్వూ, నాగరాజూ పెళ్లివార్ని చూసుకోండి. మగపెళ్లివారు సాయంత్రాని కొస్తారు. వాళ్లకేం కావాలో అడిగి అందివ్వాలి. ముందు టిఫిను తినండి'' అంది పిన్ని.

''అదేమిటీ అతనికీ, నాగరాజుకీ పన్లు చెప్పేస్తున్నావ్. వాళ్లని కొంచెం విశ్రాంతి తీసుకోనీ'' అన్నారు బాబాయిగారు.

''మరేం ఫర్వాలేదు. మావాడికీ నాగరాజుకీ తెలీని విషయంలేదు. వాళ్లుంటే నాకు ధైర్యం. అసలే పెళ్లికొడుకు పెద్ద బావగారు చాలా పేచీకోరు మనిషని మీరేగా చెప్పారు'' అంటూ లోపలికి వెళ్లింది పిన్ని.

అందరి బంధువుల్నీ పలకరిస్తూ గోధుమ నూక ఉప్మా టిఫిను తిని కాఫీ రెండు కప్పులు చప్పరించాను. నాగరాజు పూజాదికాలు ముగించి టిఫెను తిని పరిసరాలన్నీ చూసొచ్చాడు. వంట పందిట్లో ఏమేమి కావాలో, స్టోర్‌రూం ఎక్కడుందో చూశాడు. విడిదిలోకెళ్లి పరిస్థితులు గమనించి వచ్చాం ఇద్దరం. పెళ్లివారికి సెంటు, తలనూనెలు, పౌడర్లు, సబ్బులు, దువ్వెనలు, పళ్లపొడులు, వేపపుల్లలు అన్నీ సిద్ధం చేశాం మధ్యాహ్నం భోజనాల సమయానికల్లా. రెండు పేకముక్కల కట్టలు కూడా కొన్నాను నేను.

మధ్యాహ్నం ఓ కునుకుతీసి టీ తాగి ఊళ్లోకి బయలుదేరాం. అదేమంత పెద్ద ఊరు కాదు. ఓ పదిహేనువేల జనాభా వుండవచ్చు. ఊరిమధ్యలోంచి వెళ్తోంది పెద్ద కాలువ. దానిపైని వంతెన చాలా రద్దీగా ఉంది. రిక్షాలు, బళ్లు మనుష్యులు తోసుకుంటూ వెళ్తున్నారు, రాసుకుంటూ నడుస్తున్నారు.

కాలువ సుమారు నూరడుగుల వెడల్పుంది. వరదల్లో తాటి లోతుంటుంది. నీరు నిండా ప్రవహిస్తోంది. ఎర్రటి రంగు నీరు. ఇంచుమించు నేను త్రాగిన టీ రంగులో ఉంది. అక్కడెవరో చెప్తున్నారు 'ఈ కాలువ గత మూడ్రోజులుగా వర్షాలకి బాగా పొంగిందనీ, ఖమ్మం జిల్లాలో వర్షం కురిసినా ఆ కాలువ పొంగుతుందనీను'.

గత రాత్రి కురిసిన వర్షానికి రోడ్లన్నీ రొచ్చురొచ్చయిపోయాయి. ఓ రెండు మొక్కజొన్న పొత్తులు కొని కాల్పించి తింటూ వస్తున్నాం నేనూ, నాగరాజు. వంతెన దగ్గరకొచ్చి కాలువని చూస్తూ తింటున్నాం. కాలువలో నీరు ఏనుగీతలాడుతోంది. సుళ్ళు తిరిగి వేగంగా ప్రవహిస్తోంది. వంతెన మీంచి ఏదో ఊరేగింపు వస్తోంది. జనం పక్కకి తప్పుకుంటున్నారు. కొద్దిమంది వంతెన ప్రక్క పిట్టగోడ మీద కూర్చున్నారు.

ఉన్నట్టుండి ఎవరో కుర్రాడు నీళ్లల్లోకి ఉరికాడు వంతెనమీంచి. జనం అంతా విరగబడి చూస్తున్నారు. కొందరు కేకలు పెడుతున్నారు. ఎవరో ఏడుపు మొదలుపెట్టారు. కొంతమంది కాలువ కటూయిటూ వున్న గట్లమీద నుంచుని చోద్యం చూస్తున్నారు. మరికొందరు ఆ కుర్రాడు కనబడతాడేమోనని కాలువ గట్టుమీదకి పరుగుతీసారు. కానీ ఎవ్వడూ నీళ్లల్లో దిగడానికి సాహసించలేదు.

నాగరాజు చేతిలో మొక్కజొన్న పొత్తు కిందపడేసి చొక్కా ఊడదీసి నాచేతికిచ్చాడు. కట్టుకున్న లుంగీతీసి అండర్‌వేర్‌తోటే వొంతెన మీంచి కాలువలోకి ఉరికేశాడు. నేను ''నాగరాజూ! వద్దురా. ప్రమాదం. నీకు తెలీదు. కాలువ చాలా లోతు, అదీకాక నీరు చాలా వడిగా వుందిరా'' అని ఎంత మొత్తుకున్నా వాడు వినలేదు. నాకు బేజారైపోయింది. నేను కాలువకి కుడివైపు గట్టుమీదకి పరుగుతీసాను.

మొదట నీటిలోపడ్డ కుర్రాడు యాభై అడుగుల దూరంలో తేలాడు. వాడి చేతులు పైకి కనబడుతున్నాయి. మునుగుతున్నాడు, తేల్తున్నాడు. నీరు వాడ్ని కిందకి లాగేస్తోంది. మనిషి తల మాత్రం కనబడింది నాకు. వాడికి బొత్తిగా ఈత వచ్చినట్లులేదు. అలా నీటి వేగానికి కొట్టుకుపోతున్నాడు.

నాగరాజు గజ ఈతగాడు. వాడి సంగతి నాకు తెలుసు. చిన్నప్పుడు గోదావరిలో స్నానాలు, ఆటలు నాకు గుర్తున్నాయి. వాడు నీటి వేగాన్ని ఆసరాగా చేసుకుని తొందరగా ముందుకెళ్లాడు. బలంగా ఈత కొడ్తున్నాడు. క్షణాల్లో ఆ మునిగితేలే కుర్రాణ్ని సమీపించాడు. చేతికందుతూ ముందుకెళ్తున్నాడు వాడు. నాగరాజు వాడ్ని కుడిచేత్తో దగ్గరకు లాగాడు. ఒక్కసారి వాడు నాగరాజుని పెనవేసుకున్నాడు.

జనంలోంచి వొకడు తాడు విసిరాడు. కానీ అది నాగరాజుకీ, కుర్రాడికీ చాలా దూరంలో పడింది. వాళ్లు ప్రవాహంలో కొట్టుకుపోతూనే ఉన్నారు. మరొకడు గడకర్ర అందివ్వబోయాడు గట్టుమీంచి. దాన్ని తృణిలో దాటిపోయారు నాగరాజు, కుర్రాడు.

ఓ రెండు ఫర్లాంగుల తర్వాత కాలువ ఎడంవైపుకి మళ్లింది. అక్కడ నాగరాజు ఆ కుర్రాడ్ని పట్టుకుని గట్టుకి సమీపంగా వచ్చాడు. ఎవడో అందిచ్చిన వెదురుగడ నాగరాజు ఎడం చేతికి తగిలింది. దాన్ని గట్టిగా పట్టుకున్నాడు వాడు. కాలువ మలుపు తిరిగినచోట నీటి వేగం తగ్గింది. నలుగురు గడని పట్టుకుని గట్టుపైకి లాగారు. నాగరాజు మాత్రం పట్టు విడవకుండా గట్టుని సమీపించాడు. గట్టుపై జనంలో కొందరు వాడికి చేయూతనిచ్చారు. కుర్రాణ్ణి కూడా పైకి లాగారు.

కాలువ గట్టు మీద ఆ కుర్రాడ్ని వెల్లకిలా పడుకోబెట్టి నాగరాజు పొట్టనొక్కి నీరు కక్కించాడు. కుర్రాడు స్మారకంలో లేడు. వాడు కట్టుకున్న బట్టలూడదీసాడు నాగరాజు. నీరు కక్కించాక కొంతసేపటికి వాడు తేరుకున్నాడు. వాడ్ని రిక్షాలో కూర్చోబెట్టి హాస్పిటల్‌కి తీసుకువెళ్లారు ఎవరో వాడి తాలూకు మనుషులు కాబోలు.

నేనీ గంద్రగోలమంతా కాలువకి కుడివైపు గట్టుమీంచి చూశాను. నాగరాజు బాగా అలసిపోయాడు. గట్టుమీద కూలబడ్డాడు. జనంలో వొకడు వాడికొక తువ్వాలిచ్చాడు. దాంతో

తల, ముఖం తుడుచుకుని నాకోసం వెతుకుతున్నట్లు చూశాడు. నేను ఆవలి గట్టు మీంచి ''ఉరేయ్ నాగరాజూ! అక్కడే వుండు. వస్తున్నాను'' అంటూ అరిచాను. వాడు నావంక చూసి చెయ్యెత్తి ''సరే'' అంటూ సంజ్ఞ చేసాడు.

నాగరాజు బట్టలు పట్టుకుని నడిచి వంతెన దాటి వాడి దగ్గరకు చేరుకున్నాను. అప్పటికింకా అక్కడ జనం గుమిగూడి ఉన్నారు. కొందరు నాగరాజుని ''మీదే ఊరని, ఎందుకొచ్చావని'' అడిగారు. వాడు నీర్సంగా సమాధానాలు చెప్పాడు.

నేతెచ్చిన బట్టలేసుకుని బయల్దేరాడు ఇంటికి నాగరాజు. నా బలవంతం మీద రోడ్డుపక్క హోటల్లో ఓ కప్పు పాలు తాగాడు.

''ఉరేయ్! ఈ సంగతంతా పెళ్లింట్లో ఎవరికీ చెప్పకు. అనవసరపు పబ్లిసిటీ ఎందుకు?'' అన్నాడు నాగరాజు సాలోచనగా.

''ఎవరికి చెప్పాలో ఎవరికి చెప్పకూడదో నాకొదిలెయ్. నేను అవసరమైనంత మటుకు చెప్తాను అంతే'' ఇల్లు చేరాక బాబాయిగారి తమ్ముడు శేషాచలానికి మరో ఇద్దరు ముగ్గురికి జరిగిన విషయం చెప్పాను. వాళ్లు నాగరాజుని హీరోని చూసినట్లు చూశారు. వాడు మాత్రం ఏమీ జరగనట్టే ఉండిపోయాడు.

అనుకున్న సమయానికి పెళ్లివారు రానే వచ్చారు. నేనూ నాగరాజు రంగంలోకి ఉరికి వాళ్లకి అన్ని సదుపాయాలూ చూస్తున్నాం. పెళ్లి కొడుకు అందగాడే. మాటా మంతీ బాగానే ఉంది. పెళ్లికొడుకు తండ్రికసలే భేషజంలేదు. కొంచెం అతిశయంగా ఉన్నవాడు పెళ్లికొడుకు బావగారే. ఆయన్ని మేమిద్దరం చూసుకున్నాం.

రాత్రి భోజనాల సమయానికెటుపోయాడో నాగరాజు కనబడలేదు. నేను ఎవర్నడిగినా ''మాకు తెలీదు'' అనే చెప్పారు. ఇంతలో శేషాచలం నన్ను పక్కకి పిలిచాడు.

''నాగరాజు కోసం పోలీసులొచ్చారు. అతన్ని స్టేషన్‌కు తీసుకువెళ్లారు. వొకసారి నువ్వూ, నేనూ వెళ్లొద్దాం'' అన్నాడు శేషాచలం.


మగపెళ్లివారి భోజనాలయ్యాక ఇద్దరం బయలుదేరి స్టేషన్‌కెళ్లాం. అక్కడ నాగరాజు ఎస్ఐ గదిముందు బెంచీమీద కూర్చున్నాడు. వాడి తలమీద జుట్టు రేగిపోయింది. మనిషి బాగా డీలాలాగా ఉన్నాడు. నేను వాడి దగ్గరకెళ్లి ''వీళ్లేమంటున్నార్రా?'' అని అడిగాను.

''వీళ్ల అనుమానం నేను ఆత్మహత్య చేసుకోవడానికి కాలువలో దూకాననీ, ఎవరో నన్ను రక్షించారానీను. నేనెంత కాదన్నా వినడంలేదు. నా వివరాలన్నీ తీసుకున్నారు. నామీద కేసు బనాయించేట్టే కనిపిస్తున్నార్రా. ఎవర్నైనా పెద్దవాళ్లను పిలుచుకురండి'' అన్నాడు గొంతు తగ్గిస్తూ.

అక్కడున్న పోలీసు నావంక చూసి ''నువ్వెవరు?'' అని గదమాయిస్తూ అడిగాడు. శేషాచలం అందుకుని ''వీళ్లిద్దరూ మా ఇంట్లో పెళ్లికని పొరుగూరు నుంచి వచ్చారు. మా బంధువులే. నాగరాజు చేసిన తప్పేమీలేదు. అతనెవర్నో రక్షించడానికే నీళ్లలోకి ఉరికాడుగానీ మరే ఉద్దేశ్యంలేదు'' అన్నాడు.

నేను ధైర్యంచేసి ''కావాలంటే మీరు దర్యాప్తు చేసుకోవచ్చు'' అన్నాను.

''అదంతా రేపు చూస్తాం. ఎస్ఐగారు ఇంటికి వెళ్లిపోయారు. మీరు రేపు రండి'' అన్నాడు పోలీసు.




''నాగరాజు కూడా మాతో రావచ్చాండి?'' అని అడిగాను.

''అతనిక్కడే ఉంటాడు. మీరెళ్లండి'' అన్నాడు.

నేనూ, శేషాచలం ఇల్లుచేరి బాబయిగార్కి, కరణం గారికి జరిగినదంతా చెప్పాం. ఆరాత్రి పంచాయితీ ప్రెసిడెంటు వెంకయ్యనాయుడు వచ్చి ఎస్ఐతో చెప్పేదాకా నాగరాజుని వదల్లేదు.

ఆ మర్నాటి సాయంకాలానికి పోలీసులు తెల్సుకున్నారు నాగరాజు నిర్దోషని. నీళ్లల్లో పడ్డ కుర్రాడు, వాడి తండ్రీ అందరూ పోలీసు స్టేషన్‌కెళ్లి జరిగిన విషయం చెప్పారు. ఆ కుర్రవాడు ఆత్మహత్య చేసుకోవాలని నీళ్లలో ఉరకలేదని, పిట్టగోడ మీంచి జారి పడ్డాడనీ చెప్పారు. అప్పటికిగానీ నాగరాజు మీద అనుమానం పోలేదు వాళ్లకి. ఆ కుర్రవాడి తండ్రీ, తల్లి మాత్రం నాగరాజు కాళ్లకి దణ్ణం పెట్టారు వాడ్ని రక్షించినందుకు.

**(పోలింగు ఆఫీసరు...వచ్చేవారం)**

★